గంట సేపటికి వాళ్ళు నలుగురూ వొచ్చేటప్పటికి ఆ ఇంట్లో ఎవరూ లేరు. సామానూ లేదు. దూరంగా వెళ్ళే పన్నెండుగంటల పాసింజరు గార్డు పెట్టె వెనక ఎర్రదీపం కనపడుతోంది. ఖాదర్ చిందులు తొక్కు-తున్నాడు.

"ఎత్తుకు పోయినాడు. ఇదంతా కుట్ర" అంటున్నాడు.

సూర్యారావుని తలుచుకుని ముగ్గురు మిత్రులకీ చాలా అసహ్యంగా వుంది. కాని—

"ఏడిశావులే." అని ఖాదరు నడుంమీద తన్నాడు సాంబం.

"వాణ్ణి మూడులోకాలూ వెతికి పట్టుకు చంపుతాను" అన్నాడు ఖాదర్.

"ఏడిశావు. తీసుకుపోతే పోయినాడు. ఇంకో పిల్లని చూసుకో. కాని వాడి వొంటి మీద చెయ్యిపడ్డదా పధ్నాలుగు లోకాలూ వెతికి నిన్ను నరుకుతాం జాగర్త."

అని ముగ్గురూ రైలు స్టేషన్‌కి వెళ్ళిపోయినారు, సూర్యారావు ముందు జాతకాన్ని విమర్శించుకుంటో, అర్ధరాత్రి శూన్యమైన ఆ ఇంటో, లోకమే శూన్యమైన ఖాదరు ఏడుస్తున్నాడు. దూరంగా గ్రామఫోను దునియామె కోన్ హమారా అని పాడుతోంది.

★

# సరస్వతీ ప్రసన్నం

పాపం! రాత్రి పదింటిదాకా లెఖలు చేసింది శ్యామల. ఎంత చెప్పినా ఎన్నిసార్లు వల్లించినా జ్ఞాపకం వుండవు 'ఆ ఫార్ములాలు ముగ్గులు వెయ్య

డానికి కని యీ జామెట్రీని ఆర్యులు కనిపెట్టా రన్నారు ఆర్యసంతతివారొకరు. ఇప్పుడు ముగ్గులు పోయినా జామెట్రీ మిగిలింది. తప్పు చెప్పావంటే నేను; శ్యామల నవ్వుతుంది. గుండె రాయి చేసుకుని కోప్పడితే చప్పున గ్రెటా గార్బోవల్లే పెదవులమీద చిరునవ్వును కళ్ళలో నీళ్ళుగా మారుస్తుంది. ఆమె పెదవులు దగ్గరగా ముడుచుకుంటే ఆలోచనకో, ముద్దుకో అర్థం కాదు నాకు. 'రైడర్ ఆమె కెంత సమస్యో ఆమె నా కంత సమస్యగా వుంది. ఎన్నటికన్నా శ్యామల గొప్ప జమ్ట్రీషియన్ కావచ్చునుగాని ఎంత మంది స్త్రీల సమస్యలను 'స్టడీ' చేసినా నేను మాత్రం స్త్రీ హృదయపండితుడిని కాలేను. ఆ మిస్టరీయే గావును నా నిరంతరాన్వేషణానికి కారణం నోటు పుస్తకం మీదికి శ్యామల తల వొంచినప్పుడు పొడుగాటి జుట్టు మెలికలు తిరిగి చెంపల మీద పడుతుంది. తలెత్తి తాను వేసిన అంకెలు తప్పో వొప్పో నా కళ్ళలో కనిపెట్టాలని చూసినప్పుడు ఆ కళ్ళలో సౌందర్యం అప్రిషియేషన్ తప్ప యింకేం కనపడదు. నాకు దిగులేస్తుంది. ఆ గోడని పది మందీ ఎన్ని రోజుల్లో పెడితే యీ పిల్ల కెందుకు? ట్రయాంగిల్ వైశాల్యమెంతవుంటే ఆమె కేమిటి? ఆ విస్తీర్ణంతో ఆమెకి పనేముంది? సుఖంగా వెన్నెట్లో జింకపిల్లవలె గంతులేస్తో శ్రవణానందంగా పాటలు పాడుతో, నా వొళ్లో కూచుని మెడమీద చేతులు వేసి గోము చెయ్యవలసిన వయస్సులో, నడుం వొంచి నాకు విసుగు పుడుతుందేమోనని భయంగా కన్ను చివరనించి కనిపెడుతో యీ దరిద్రపు నిర్జీవ సంఖ్యల్ని, గీతల్ని గీస్తో కూచోవలసిన యీ నిర్భాగ్యవిద్య యెవడు కనిపెట్టాడో? జాలి వేసేది. కాని పరీక్షలో తప్పితే ఆ పరీక్షవాడు ఆమె అందాన్ని చూస్తాడా, అంకెల అందాన్ని చూస్తాడు కాని!

ఆమె పడబోయే వేదనని తలుచుకొని హృదయం రాయి చేసుకొని, ఆమె నడుం దగ్గరికి జరక్కుండా చేతులకు ఆజ్ఞలు పెడుతో మనసుని ఆమె పెదవులనించి హెడ్మాస్టరు బోర్డవైపు మళ్ళించి, లెక్కలు బోధించాను. నా చివాట్లతో విసుగుమాటలతో ఆమె కళ్ళ వెంబడి నీటిచుక్క గడ్డం కిందనించి జారి జాకెట్టుకి మెరిసే దేహానికి మధ్య రాలినప్పుడు కూడా నేను నవ్వనన్నా లేదు, తుడవనన్నా తుడవలేదు.

లెక్కలు పూర్తి ఐనాయి. రాత్రికి చదువు కూడా పూర్తి అయింది. నా ముఖం నవ్వింది. శ్యామల ఆ నోటు పుస్తకాన్ని మంచాల అవతలకి దూరంగా విసిరి, దబాలున నా మంచం మీదకి దూకి, యిటూ అటూ పొర్లించి, నన్ను లాగి పడుకోపెట్టి,

"ఈ లెఖ్ఖ చెప్పండి. పావుగంటలో ఒకరు వెయ్యి ముద్దులు మురిపాలు, ముప్పయి తొమ్మిదిన్నర నిముషాల్లో ముగ్గురున్నర మనుషులు...."

"సరేగాని, రేపు పొద్దున్న బడి."

అంటో నే నాలిక కొరుక్కున్నాను. పాపం బిక్కమొహం వేసి ఒక్క నిముషం ఆలోచించి, లేచి తన పక్కమీదికి వెళ్ళి పడుకున్నాడు.

'మా హెడ్ మిస్ట్రెస్—కాదు—లిల్లీ టీచరు, చచ్చిపోతే బాగుండును' అంటో కళ్లు మూసుకుంది. నాకు నిద్రపట్టలేదు. ఆమె చెయ్యి నా మెడమీద తిరుగుతో నన్ను జో కొట్టటం అలవాటయింది. ఎట్లా లేపను? పాపం, అలసిపోయింది. అనుకుంటో కళ్ళు మూసుకుని ఆ శ్యామల బదులు నువ్వు రమ్మని నిద్రాదేవిని ఆహ్వానించాను? కాని దక్షిణపుగాలి వీచి, శ్యామల పక్కమీదనించీ, ఆమె జుట్టులోనించీ ఆమె వొంటి పరిమళంతో మదమెక్కిన మల్లెపూల వాసనల్ని నా దగ్గిరకి తీసుకొచ్చి నవ్వుతోంది. తలెత్తి ఆమెవంక చూశాను.

'నీకు యీ జన్మలో లెఖ్ఖలు రావు' అనే నా నిందని నాకు వొప్పచెపుతూ యిందాక కళ్ళు మూసుకుంది పాపం. ఆ పాడు లెక్కకు ఆప్తుడైయిన నన్నూ మరిచి నిద్రపొయ్యే ఆ పిచ్చిమొహాన్ని చూసి లేపడానికి మనసు రాక మళ్ళీ వూరుకున్నాను. నా మొహంవల్ల కదా సంతోషం కన్నా ఎక్కువైన లెఖ్ఖలూ, స్కూలూ, పరీక్షలూ, మీ జ్ఞాపకం తెచ్చే విచారాన్ని మింగగలదా?

ఎందుకి కష్టం? స్కూలుఫైనలు కావాలనే యీ ఆదర్శం యీ లావణ్యానికి? కాని చదువుకుని, వుద్యోగం చెయ్యాలనే అభిలాషని నేనే

కదా. ప్రేరేపించింది? ఐతే చదువుగాక మరి వేరే పని యేముంది, పెళ్ళి తప్ప! యీ పిల్లకి? పెళ్ళిళ్ళు పూర్వకాలం ఆనందదాయకా లేమోగాని, ఇప్పుడు భార్యల్ని వొదిలెయ్యడం, తరిమెయ్యడం, హింసించడం యెక్కువయింది. పిల్లలతోసహా తాను ఏమౌతుంది? అదిగాక వంటతో, పిల్లలతో తృప్తిపడడం మానుతున్నారు ఈనాటి స్త్రీలు, ముఖ్యంగా శ్యామలబోటి వాళ్ళు. భర్తమీది భయం పోయింది. దినదినమూ ఒకే విధంగా ఇంటో కంటో వుండరు. దుర్భరంగా వుంది. భర్త పోషణనీ, అధికారాన్నీ తప్పించుకోవాలంటే చదువు తప్ప యింకో మార్గం దొరకలేదు. చదువులో వుండే బాధా? అర్థహీనత్వమూ, నిర్జీవత్వమూ నాకు తెలుసు. ఆత్మ స్వేచ్ఛనీ, ఆనందం పొందే శక్తినీ నాశనంచేసే మార్గం అంతకంటే మంచిది దొరకదు. మొగపిల్లలు పడుతున్న బాధలు చాలవా? పువ్వుల్ని కూడా ఆ మరలోనే పెట్టి తిప్పాలా! ఇంక 'ఆలటర్నేటివ్ పెళ్ళి అనే నరకమా? ఎంత క్రూరంగా పరిణమించింది యీ నవీన జీవతం! పోనీ అందంలేని ఆడవాళ్ళు చదువుకోవచ్చు, చాతనైతే పెళ్ళి చేసుకోవచ్చు. కాని యిట్లాంటి సౌందర్యం వున్నవాళ్ళకి యేం ఖర్మం? బల్లలు దగ్గిర కూచుని ఆ లేత బుజాలు ముందుకి వొంగి, చక్కని కళ్ళకి జోడు తగిలిస్తే యెట్లా వుంటుంది? ఈ ముద్దుమాటలు మాని యింగ్లీషుముక్కలు మాట్లాడుతూవుంటే! కాని అందం జీవనోపాధి నిస్తుందా? ఏ మొగాణ్నో పట్టుకుని, రక్తమూ డబ్బూ పీల్చి వాడికి బానిస కావాలి యింక! కాని బానిస కావడమేమి? యజమానురాలై రాజ్య మేలకూడదా? అందం పోయింతరవాతో! తక్కిన నౌకర్లవలెనే కూడబెట్టుకోవాలి. పెన్షన్ ఇవ్వాలి. గొప్ప పాటకుడు వంట చేస్తాడా? గొప్ప నటకుడు కూలీ చేస్తాడా? గొప్ప కథకుడు టీచరుపని చేస్తాడా? గొప్ప కవి ప్లీడరుపని చేస్తాడా? శృంగారంగల స్త్రీ మంత్రసాని గావలసిన ఖర్మ మేమిటి? సినిమాలో చేరడానికి వెడితే! సంగీతం కావాలి. ఆ బానిసత్వం కన్న పెళ్ళే నయమేమో! ఒక్కసారి సినిమాకి వెళ్ళివచ్చింతరవాత హృదయం రాయి ఐ, ఆ కఠినపురాతి నవ్వు నవ్వితే ఆ టక్కులు చేస్తే, ప్రేమ

చూపినా నటనలాగే వుంటుంది గావును! ఎంత క్రూరరూపాన్ని ధరించింది యీ చక్కని ప్రపంచం! భోజనానికై ఎంత బాధ! మనిషికి ఎన్ని అవసరాలు! ఎంతో స్వేచ్ఛ నమ్ముకుని, ఎంతో ఆనందాన్ని త్యజిస్తేనేగాని జీవితం గడవదుకదా; స్త్రీ పురుషుడికి బానిసత్వం చేస్తోందని గోల పెడతాడుగాని వెంకటచలం, పురుషుడు పురుషుడికి బానిసత్వం చెయ్య కుండా బతుకుతున్నాడా? స్త్రీకి మాత్రం భర్త బానిసత్వం తప్పుతుందా? ప్రపంచధర్మమే, జీవితావసరమే అట్లా వున్నప్పుడు ఏదో ప్రేమో, సెంటి మెంటో వున్న యీ గృహ బానిసత్వం నయం గాదా, రూపాయల బానిసత్వం కన్న! పొయ్యి దగ్గిర స్త్రీ పడివుంటే బల్లదగ్గిర పురుషుడు పడివుండటంలేదా? ఇట్లాంటి సమస్యలలో బాధపడుతున్న నన్ను నిద్ర కావలించుకుని, శ్యామలనించి దూరంగా తీసుకుపోయింది.

ఎంత సేపయిందో,

"మాస్టర్, మాస్టర్!"

మెల్లిగా నిద్రాదేవి కుంతలపు చిక్కుల్ని విదిలించుకుని యీ లోకానికి దిగాను. అంతకన్న మృదువైన హస్తాలు నన్ను తట్టి పిలుస్తు న్నాయి. శ్యామల నా పక్కలో కూచుని లేపుతోంది.

"ఏమిటి?"

లంబాడివాళ్ళవలె జుట్టుపక్కల కట్టుకున్న మల్లెదండలు బరువు లతో నా మొహం మీదికి వొంగింది. నేను మల్లెపూవులనూ, ఆమె పెదవుల్నీ ఆనందిస్తున్నాను.

కొంచెంగా నా పెదవుల్ని తప్పించుకుని,

"వుండండి. నేను చెప్పేది వినండి. నాకో కల వొచ్చింది."

"కలసంగతి - తరవాత."

"తరవాత నిద్రపోతారు. వినరు."

"నిద్రపోను"

"ఎన్నిసార్లు! ముందు వినాలి."

"ఎట్లా వినను? నువ్విట్లా వుంటే!"

"ఐతే ఆగండి...."

అని లేస్తోంది. కాని నేను ఆమె వీపుమీద చేతుల్ని గట్టిగా బిగించాను.

"వింటాను. వెళ్ళకు, చూడు. నువ్వు నిద్రపోయింతరవాత ఇందాక లేపానా? అట్లా చూస్తూ దూరంనుంచి ఆనందిస్తూ పడుకున్నాను. మంచి వాణ్ణి ఔనంటావా, లేదా?"

"కల వినండి ఐతే!"

"నిన్ను లేపనందుకు ఇదేనా కృతజ్ఞత?"

"చూపుతాను. ముందు కల వినండి. ఇది సాధారణమైన కల కాదు."

"ఏం కల? నువ్వు టీచరు కావడమూ, నీ మాట వినక యిట్లాంటి కొంటె కథలు వ్రాస్తున్నందుకు నా ఉద్యోగం పోవడమూ, నువ్వు నన్ను పోషించడమూ...."

"అదికాదు. చాలా తమాషా కల. మీరు వినాలి. యిప్పుడు"

"సరేకానీ—కాని, మధ్య మధ్య—"

"నేను లెఖలు చేస్తున్నాను....మీరు"

"కలలో కూడా లెఖలేనా శ్యామా?"

"మీరు ఆ మంచంమీద రాత్రి కూచున్నట్టే కూచున్నారు. లెఖ తప్పిపోయిందని భయపడి మీ వంక చూశాను. కాని మీరులేరు. అక్కడ మీ బదులు—"

నా యీర్ష్య వులిక్కిపడ్డది.

"ఎవరు? నా బదులు—"

శ్యామల ఫక్కున నవ్వింది.

కథా నిలయం
127

"ఎవరూ కాదు. సరస్వతి కూచుని వుంది."

"ఏ సరస్వతి? మీ టీచరా?"

"సరస్వతీదేవి!"

"దేవో, బాయో! ఏం పని ఆమెకి?"

"కాదండీ! అసలు సరస్వతీదేవి, దేవత" అని ఒక్కటి పెట్టింది నన్ను."

"ఎట్లా తెలుసు నీకు? మీ స్కూళ్ళ యిన్‌స్పెక్ట్రిస్ ఏమో?"

"వుండండి. మరి వేళాకోళం చెయ్యవొద్దు. నాలుగు చేతులు. వీణా—"

"వాయించిందా?"

"ఇంక మాట్లాడితే వెళ్ళిపోతా—వింటారుకద! కిరీటం—"

"ఇంకేం? సరస్వతే. నీ మాస్టరుస్థానంలో సరస్వతే కూర్చుంటే నే నెందుకు? మధ్య మధ్య యీ యిబ్బంది కూడా వుండదు నీకు."

శ్యామల చప్పునలేచి తన పక్కమీదికి వెళ్ళి నావంక సీరియస్‌గా చూసింది.

"మీరు వేళాకోళం చెయ్యవద్దు."

కనుబొమ్మలు దగ్గిరికి లాగింది. ఇంక మాట్లాడానా, ఉగ్రురాలై ఏడురోజులు మొహం తిప్పుకుంటుంది. సావధానుణ్ణైనాను.

"నేను దీపందగ్గిర వ్రాసుకుంటున్నాను." అని చెప్పడం ప్రారంభించింది శ్యామల.

"ఏమిటి చేస్తున్నావు?" అంది సరస్వతీదేవి.

"లెఖ్కలు దేవీ" అన్నాను.

"లెఖ్క లెందుకే నీకు?" అంది.

"పరీక్షకి వెళ్ళ వొద్దూ?"

"వెళ్ళి!"
"టీచరు పని చెయ్యాలని."
"ఎందు కా టీచరు పని?"
"ఎట్లా బతకడం?"

"ఏది నీ మొహం. పైకెత్తు. చూడూ. యీ చక్కని పెదవులూ, చంపలూ, నీకెందుకూ నేను యిచ్చింది? లెక్కలు చెయ్యడానికా? చూడు. చదివి చదివి నీ కళ్ళ అందమే పోతోంది. నీ నడుము వొంగింది, సరిగా పోషించక నీ వొంటి మెరుపు తగ్గింది. చీరె యెట్లా కట్టుకోవాలో తెలీదు. ఆ ఇంగ్లీషు ముక్కలు మాత్రం వాగుతావు. శ్రావ్యమైన కంఠం వుందే నీకు; ఏదీ శ్లోకం చదవగలవా? 'తుషారహారధవళా..........' రాదూ?"

"అందం యేం లాభ మండీ, తిండి పెడుతుందా?"

"పెట్టదా? ఈ మొగాళ్ళ మెడలు వొంచి పెట్టిస్తుంది."

"వాళ్ళకి లోకువకానా?"

"ఈ టీచరుపనికి! మొగవాళ్ళ నాశ్రయించవా?"

"కాని దేహాన్ని —"

"ఇప్పుడూ — నీ బుద్ధిని వప్పచెప్పటంలేదూ ? నాలుగు మూళ్ళు పన్నెండు అని చెపితే నువ్వు నమ్ముతున్నావు. ఆ కూతనే రేపు పిల్లలకి నేర్పుతావు".

"చదువుకోకపోతే గౌరవ మేదీ? ప్రతివారికీ లోకువేకద!"

"కాదు. నీ అందానికి యీ మొగాళ్ళందరూ లోకువవుతారు. ఆ మొద్దు పనులన్నీ ఆ మోటు మొగాళ్ళకే వొదులు. సంగీతం, నాట్యం నేర్చుకో. నీ కళ్ళతో, చిరునవ్వుతో, కంఠపు వూపులతో లోకాన్ని భ్రమింపచెయ్యడం సాధనచెయ్యి.

కోకిలా, చిలకా కుయ్యడం, ఎగరడం మాని, బళ్ళు లాగడం, కన్నాలు తవ్వడం చేస్తే యెట్లా ఉంటుంది? ఈ మొగాళ్ళ మాటలు తనకు

మీ ఆకర్షణ నించి తప్పించుకోలేక, మీకు దాసులై సేవ చెయ్యలేక, మీ రెక్కలు విరక్కొట్టి, మీ అందాలు నాశనంచేసి, అనాథల్ని, టీచర్లనీ చెయ్యాలని చూస్తున్నారు. సమస్తధనమూ అడగకుండా మీ ముందు గుమ్మరించేట్టు చేసేవిధం వుండగా యీ ఇరవై రూపాయల ఖర్మ మేమిటి నీకు?"

"పాపం కదండీ?"

"ఇదీ? సుఖంగా ఆడుకునే పిల్లల్ని గదుల్లో బంధించి, యేడిపించి, అర్థంలేని యీ పాడు చదువు చెప్పడంకన్న పాపం యింకోటి వుందా ? ఆడదానికి నీ ధర్మంమీరి మొగవాడి పనిచెయ్యడం ధర్మశాస్త్రాలు వొప్పుతాయా ?

సోమరులై ప్రజల సొమ్ముతినే యీ వేదాంతులకన్న, నీతి వేత్తలకన్న పాపం చేస్తానా, కష్టపడి ఆనందాన్నిచ్చి ధనం తీసుకుంటే! ఇతరులకి సౌఖ్యాన్నిచ్చే ప్రయత్నంలో తానూ సౌఖ్యపడే ఉద్యోగం అత్యుత్తమం. ప్రజలు ఏడుస్తో సంపాయిస్తారు. చీకటి గదుల్లో ఆ బడిపిల్లల్ని చంపి నువ్వు చచ్చి—దానికన్న — ఆలోచించుకో, అట్లా జన్మ అంతా గడించేది ఒక్క నెలలో గడిస్తావు కావలిస్తే ధర్మాలు చెయ్యి" అని అంతర్ధానమయింది.

"యేమంటారు?"

★